సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం ׀ 18 ׀ డిసెంబర్ ׀ 2023




రూ.2 లక్షల విరాళాలు
తొండంగి: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి జ్ఞానేంద్రరావు (విశాఖపట్నం) రూ.1,00,116, పవన్ కుమార్, అన్నపూర్ణ దంపతులు (హైదరాబాద్) రూ. లక్ష చొప్పున ఆదివారం విరాళాలు సమర్పించారు.

షణ్ముఖనాథ.. అభయప్రద..
షష్ఠి మహోత్సవాల సందర్భంగా బిక్కవోలులోని శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్నారు.



- 8లో

డెల్టాలకు 8,200 క్యూసెక్కులు
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు ఆదివారం 8,200 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,800, సెంట్రల్‌కు 400, పశ్చిమకు 5,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. సముద్రంలోకి 6,030 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.



న్యూస్‌రీల్

ఎస్పీ శ్రీధర్‌కు డీజీపీ డిస్క్ అవార్డు



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి నుంచి డిస్క్ అవార్డు అందుకుంటున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) కె.రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ డీజీపీ కమెండేషన్ డిస్క్ అవార్డును అందుకున్నారు. 2022 సంవత్సరంలో శాంతి భద్రతల పరంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు ఐపీఎస్ అధికారులకు మంగళగిరి డీజీపీ ప్రధాన పోలీసు కార్యాలయంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఎస్పీ శ్రీధర్ ఈ అవార్డును స్వీకరించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలోనే కాకుండా క్షేత్ర స్థాయి నేరాల అదుపునకు చేసిన కృషికి గాను ఎస్పీ శ్రీధర్‌ను ఈ అవార్డు వరించింది. శాంతి భద్రతలతోపాటు దిశ, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ పరంగా ఎస్పీ శ్రీధర్ కనబరిచిన పని తీరును రాష్ట్ర డీజీపీ కార్యాలయం గుర్తించింది. ఎస్పీ శ్రీధర్‌కు అవార్డు అందించి డీజీపీ అభినందించారు. అవార్డు అందుకున్న ఎస్పీ శ్రీధర్‌ను జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, జిల్లా దిశ డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఏఆర్ డీఎస్పీ పి.పార్థసారధి, అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట డీఎస్పీలు ఎం.అంబికాప్రసాద్, టీఎస్ ఆర్కే ప్రసాద్, వెంకటరమణ అభినందించారు.

ఇసుక స్కామ్‌కు ఆద్యుడు లోకేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణ రావు. పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇసుక స్కామ్‌కు ఆద్యుడిగా ఉండి రూ.కోట్లు దోచుకున్నారని ఎమ్మెల్సీ, ఉభ య తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు ఆరోపించారు. 'ఇసుక స్కామ్‌లోనే కాదు.. నాడు నువ్వు, మీ నాన్న చంద్రబాబు జిల్లా బీసీలకు మాయమాటలు చెప్పి నిలువునా ముంచారు' అని వ్యాఖ్యానించారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివా రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా పెద్ద పీట వేసిన ముఖ్యమంత్రి జగన్‌ను బీసీల ద్రోహి అంటూ లోకేష్ తన పాదయాత్రలో పిచ్చి పేలాపనలతో మాట్లాడుతున్నారని చెప్పారు. బీసీల ఓట్లతో నాడు గద్దెనెక్కిన చంద్రబాబు, లోకేష్ అదే బీసీలను బూటకపు హామీలతో ఏడాపెడా మోసం చేశారని గుర్తు చేశారు. పాదయాత్రలో లోకేష్ ప్రసంగాలు వింటే తాను ముఖ్యమంత్రి అయినట్టు పగటి కలలు కంటున్నాడని అర్థమవుతోందన్నారు. 'మీ తండ్రి చంద్రబాబును నువ్వే ఓ డమ్మీగా చిత్రీకరిస్తున్నావు' అని సూర్యనారాయణరావు అన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ నాయకులు కుడుపూడి త్రినాథ్, భరణికాన బాబు, పరంశెట్టి దీప్తి, యనమదల కరుణాకర్ పాల్గొన్నారు.

20న జిల్లా స్థాయి కౌశల్ ప్రతిభా పోటీలు
అంబాజీపేట: జిల్లాస్థాయి కౌశల్ ప్రతిభ పోటీలు ఈ నెల 20న అంబాజీపేట హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు కౌశల్ జిల్లా కో ఆర్డినేటర్ బి.ఎస్.ఎన్. మూర్తి తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి ఆదేశాల మేరకు కౌశల్ పోటీలను కేవలం ప్రభుత్వ పాఠశాలల హైస్కూల్ విద్యార్థులకు మాత్రమే నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీలు క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ అనే రెండు విభాగాలలో జరుగుతాయన్నారు. 200 మంది విద్యార్థులు పాల్గొంటారని, క్విజ్ మాస్టర్‌గా టీఎ స్‌వీఎస్.సూర్యనారాయణమూర్తి, పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వాహకులుగా ఆప్కాస్ట్ అకడమిక్ కోఆర్డినేటర్ పీవీ బ్రహ్మానందం వ్యవహరిస్తారన్నారు.

కిక్కిరిసిన అయినవిల్లి
అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొల్పు సేవ నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతి హోమంలోను అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ జరిపారు. పంచామృత అభిషేకం, ప్రత్యేక అభిషేకాల్లో 46 మంది భక్త దంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 453 మంది భక్తులు, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 30 స్వామికి పూజలు నిర్వహించారు. 26 మంది నూతన వాహన పూజలు చేయించుకున్నారు. 26 చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు, నిర్వహించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,05,189 లభించిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

సాధికార ప్రభంజనం



సభలో ప్రసంగిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు. చిత్రంలో మంత్రులు తానేటి వనిత, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు



సాధికార సామాజిక బస్సు యాత్రకు అశేషంగా తరలివచ్చిన జన సందోహంలో ఒక భాగం

- జనసంద్రమైన దేవరపల్లి
- సామాజిక సాధికార బస్సు యాత్రకు అపూర్వ స్పందన
- వేలాదిగా తరలి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు
- బైక్ ర్యాలీకి అడుగడుగునా బ్రహ్మారథం
- మిన్నంటిన 'జై జగన్' నినాదాలు

సాక్షి, రాజమహేంద్రవరం/దేవరపల్లి/నిడదవోలు రూరల్/వాగల్లు: సామాజిక సాధికార బస్సు యాత్ర జరిగిన వేళ.. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలోని మండల కేంద్రమైన దేవరపల్లి జనసంద్రమే అయ్యింది. సాధికార దరహాసంతో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడింది.. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తమకు చేసిన మంచిని గుర్తు చేసుకుంటూ అశేష సంఖ్యలో తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలతో ఇక్కడి మూడు రోడ్ల జంక్షన్ కిక్కిరిసిపోయింది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని సంక్షేమం తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు నిండు మనసుతో సలాం కొట్టారు. 2024లో ఆయనే మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్యక్షతన దేవరపల్లిలో ఆదివారం నిర్వహించిన ఈ సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభకు గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకా తిరుమల మండలాల నుంచి సుమారు 30 వేల మంది తరలివచ్చారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కుర్చీలన్నీ నిండిపోవడంతో జనం రోడ్డు పైనే నిలబడి మరీ నేతల ప్రసంగాలు ఆసక్తిగా విన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే మరోసారి పట్టం కట్టే తరుణం ఆసన్నమైందన్న జోష్‌ను పార్టీ శ్రేణుల్లో ఈ సభ నింపింది.

భారీ బైక్ ర్యాలీ

నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చేకూర్చిన లబ్ధిని వివరించేందుకు పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తొలుత మంత్రులు, ఎమ్మెల్యేలతో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మూడు వేలకు పైగా ద్విచక్ర వాహనాలతో ఈ ర్యాలీ సాగింది. ఒక్కో ద్విచక్ర వాహనంపై ఇద్దరు చొప్పున ఆరు వేల మందికి పైగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. బస్సుపై ర్యాలీగా సాగుతున్న మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు ప్రజలకు అభివాదం చేస్తూ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. అడుగడుగునా పూలవాన కురిపిస్తూ ఈ ర్యాలీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. యర్నగూడెంలో విలేకర్ల సమావేశం అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు బస్సు యాత్రగా కృష్ణంపాలెం చేరుకున్నారు. అక్కడ ప్రారంభమైన ర్యాలీ దుమంతునిగూడెం, రామన్నపాలెం, బస్టాండ్ సెంటర్ మీదుగా దేవరపల్లిలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలి వరకూ 6 కిలోమీటర్ల మేర సాగింది. ర్యాలీ ఆద్యంతం జై జగన్ నినాదాలు హోరెత్తాయి. అనంతరం సభా వేదిక వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు మంత్రులు, ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

'జగన్.. వన్స్‌మోర్'

ప్రారంభం నుంచి ముగిసే వరకూ 'జై జగన్.. మా నమ్మకం నువ్వే జగనన్నా.. 2024.. జగన్ వన్స్‌మోర్' నినాదాలు సభలో హోరెత్తాయి. అధిక సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమకు చేస్తున్న మేలును గుర్తు చేసుకుని.. మళ్లీ ఆయనే అధికార పగ్గాలు చేపట్టాలని ఆకాంక్షించారు. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే ప్రసంగాలకు విశేష స్పందన లభించింది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విధానాన్ని ముఖ్యమంత్రి అనుసరిస్తున్నట్లు మంత్రి వేణు చెప్పగానే 'జై జగన్' అంటూ ప్రజలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. జబ్బులను జల్లెడ వేసి పట్టి మరీ ఇంటికే మందులు పంపిస్తున్నారని, జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా పేద పిల్లల ఉన్నత చదువులకు బాటలు వేస్తున్నారని మంత్రి వేణు వివరించారు. జగన్ పాలనలోనే తమకు, తమ బిడ్డలకు భవిష్యత్తు లభిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. 'అన్ని వర్గాలకూ మంచి చేస్తున్న జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడిపోనిస్తామా?' అని మంత్రి కారుమూరి ప్రశ్నించగా.. 'లేదు లేదు' అంటూ ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. టీడీపీ నేతల అవినీతిని ప్రస్తావిస్తుంటే వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు పుట్టగతులు లేకుండా చేస్తామని విస్పష్టంగా చెప్పారు. 'ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా? బీసీల తోక కత్తిరిస్తాం' అంటూ గతంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఎంపీ నందిగం సురేష్ గుర్తు చేయగా.. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు తోక మరోసారి కత్తిరిస్తామని స్పష్టం చేశారు. అధికారంలో ఉండగా బాబు చేసిన మోసాలను వివరించగా.. ఈసారి బాబును నమ్మి మోసపోమంటూ సభలో పైకి లేచి మరీ నినాదాలు చేశారు. తెలంగాణలో ఓటు వేసిన పవన్.. ఇక్కడ రాజకీయం చేస్తున్నారని చెప్పగా.. వచ్చే ఎన్నికల్లో దీటైన జవాబు ఇచ్చి తెలంగాణకు సాగనంపుతామని చెప్పారు. పేద బిడ్డల చదువులకు ట్యాబులు ఇస్తుంటే వాటిపై కూడా చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ రాజకీయం చేయడం దారుణమని హోం మంత్రి తానేటి వనిత అనగా.. అవునంటూ సభికులు మద్దతు పలికారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం
దేవరపల్లి పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ ఆవరణ వరకూ రూ.65 లక్షల రుడా నిధులతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రారంభించారు. కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), దేవరపల్లి సర్పంచ్ కడియం వీరకుమారి, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు అనసూరి పద్మలత, శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విపక్షాల దుర్నీతిపై వాగ్బాణాలు
చంద్రబాబు జీవితమంతా అబద్ధం, మోసం, అవినీతి పునాదులతో మొదలైంది. రూ.87 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేస్తామని మాయమాటలు చెప్పి 2014లో గద్దెనెక్కిన ఆయన.. రూ.14 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి, రైతులను నిలువునా మోసం చేశారు. ఇంటికో ఉద్యోగం, రైతులకు గిట్టుబాటు ధర అని వంచించారు. వ్యవసాయం దండగని చెప్పిన చంద్రబాబు ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నారు? ఈనాడు, ఈటీవీ, ఏబీఎన్, ఆంధ్రజ్యోతి, టీవీ–5 సీఎం జగన్‌పై బురద జల్లడమే ధ్యేయంగా పని చేస్తున్నాయి. 'అబద్ధాల చంద్రబాబు వద్దు.. నిజాల జగన్ కావాలి' అని 2024 ఎన్నికల్లో మరోసారి ప్రజలు నిరూపించాలి.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి

చంద్రబాబు హయాంలో వ్యవసాయం వృద్ధి రేటు 3.5 శాతం మాత్రమే ఉండగా.. సీఎం జగన్ తీసుకువచ్చిన పథకాలతో ప్రస్తుతం అది 11.5 శాతానికి పెరిగింది. పేద విద్యార్థులకు ట్యాబులు ఇస్తే.. పెత్తందార్లు, పచ్చనేతలు రాద్ధాంతం చేస్తున్నారు. రానున్న మేనిఫెస్టోతో జగన్ ప్రజల్లోకి వస్తే.. టీడీపీ, మిగిలిన పార్టీలు బంగాళాఖాతంలో కలవడం ఖాయం

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి

పేద విద్యార్థులకు ఉపయోగపడే కంటెంట్‌తో, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఇస్తున్న ట్యాబ్‌లపై ప్రతిపక్షాల విష ప్రచారం తగదు. ట్యాబుల్లో విద్యార్థులకు అవసరం లేని యాప్‌లు లాక్ చేస్తున్నాం. ఇది గ్రహించని టీడీపీ, జనసేన నేతలు ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. ట్యాబ్‌లలో ఇతర వీడియోలు చూస్తున్నారంటూ తల్లులు ఫిర్యాదు చేస్తున్నట్టు అసత్య ప్రచారానికి తెర తీశారు.

– తానేటి వనిత, హోం మంత్రి

అమరావతిలో చంద్రబాబు రియల్ దోపిడీకి అడ్డుకట్ట పడి నాలుగేళ్లయ్యింది. బాబుతో కలసి మాజీ మంత్రులు నారాయణ, పత్తిపాటి పుల్లారావులు పేదల భూములను దోచుకున్నారు. అమరావతిలో రెండే ఫేమస్. రూ.400 కోట్లతో నిర్మిస్తున్న అంబేడ్కర్ స్మృతివనం ఒకటైతే, కొండ పైన ఉన్న అమ్మవారి ఆలయం మరొకటి. ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా? బీసీల తోకలు కత్తిరిస్తా అంటూ నోరు పారేసుకున్న పాపానికి 2019 ఎన్నికల్లో ఎస్సీ, బీసీలు చంద్రబాబుకు బట్టలూడదీసి పంపారు. పవన్ తెలంగాణలో ఓటు వేసి.. ఆంధ్రాలో రాజకీయాలు చేస్తున్న డ్రామా ఆర్టిస్టు. రెండెకరాల పొలంతో రాజకీయాల్లోకి వచ్చి రూ.6 లక్షల కోట్లు సంపాదించింది చంద్రబాబు కాదా?

– నందిగం సురేష్, ఎంపీ, బాపట్ల



బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ చంద్రబాబు ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారు. ఆయన గ్యారంటీని ఎవరైనా నమ్ముతారా? చంద్రబాబు వస్తే ఆయన కొడుకు లోకేష్‌కు మాత్రమే జాబు వస్తుంది. ప్రజలకు, యువతకు ఉపయోగం లేదు. చంద్రబాబును నమ్ముకుంటే ఉన్నది అమ్ముకోవాలి.

– మార్గాని భరత్‌రామ్, ఎంపీ, రాజమహేంద్రవరం



బస్సు యాత్రగా దేవరపల్లి బహిరంగ సభకు తరలివస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఇతర నేతలు



దేవరపల్లి సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభకు ఉరకలెత్తే ఉత్సాహంతో భారీ ర్యాలీగా తరలి వస్తున్న ప్రజానీకం

రూ.3 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోపాలపురం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.3 వేల కోట్లు వెచ్చించాం. ఇందులో కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.1,200 కోట్లు ఖర్చు చేశాం. అభివృద్ధి పనులకు రూ.700 కోట్లు కేటాయించాం. రూ.844 కోట్ల విలువైన 3,500 ఎకరాల అసైన్డ్ భూములను ఎస్సీ, బీసీలకు పంపిణీ చేశాం. 20 వేల మంది పేదలకు జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు అందజేశాం. 12 వేల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇది కాదా సంక్షేమం?

– తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం

హ్యాపీ యానిమల్



రైతులకు ఆరోగ్య సంరక్షణ కార్డు అందజేస్తున్న వైద్యులు




- పశువులకూ పక్కాగా వైద్యం
- ఆరోగ్య కార్డులు అందజేసేందుకు చర్యలు
- మూగజీవాల సంఖ్య ఆధారంగా పాడి రైతులకు కార్డులు
- జిల్లాలో 47,608 కార్డుల పంపిణీకి చర్యలు

రాయవరం: సమాజంలో ప్రతి ఒక్కరికీ వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆరోగ్య కార్డులు అందజేస్తున్న ప్రభుత్వం మనుషులకు మాదిరిగానే మూగజీవాలకు కూడా ఆరోగ్య కార్డులు అందజేసేందుకు చర్యలు తీసుకోవడం గమనార్హం. పశువుల ఆరోగ్య సంరక్షణకు ఆరోగ్య కార్డులు తయారు చేసి జారీ చేస్తున్నారు. ఈ కార్డుల ఆధారంగా జిల్లాలో పశువుల సంఖ్య, వాటికి కావాల్సిన మందులు వంటి విషయాలు తెలుసుకోవచ్చు. ఇతర అంశాలకు సంబంధించి కూడా పలు ప్రయోజనాలున్నాయని పశు సంవర్ధక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆరోగ్య కార్డుల జారీ వలన అటు సంబంధిత శాఖకు, ఇటు రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని అధికారులు అంటున్నారు.

ప్రయోజనాలివీ..

ఒకప్పుడు పొడవాటి కరపత్రంలా ఉన్న పశు ఆరోగ్య కార్డును ఇప్పుడు హ్యాండ్ బుక్ మాదిరిగా రూపొందించి, ప్రింట్ చేసి పాడి రైతులకు ఉచితంగా అందజేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలు, పశు వైద్య శాల సిబ్బంది వీటిని రిజిస్టర్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ తరఫున రెండు రకాల యానిమల్ హెల్త్(పశు ఆరోగ్య సంరక్షణ) కార్డులను జారీ చేస్తోంది. అందులో ఒకటి పశు ఆరోగ్య సంరక్షణ కార్డు. ఆరు ఆవులు/గేదెలు/పోతులకు మాత్రం వర్తిస్తుంది. రెండవది గొర్రెలు/మేకలకు ఆరోగ్య సంరక్షణ కార్డు అందజేస్తారు. గొర్రెలు/మేకలకు అయితే 20 జీవాలకు ఒక ఆరోగ్య సంరక్షణ కార్డును అందజేస్తారు. ఈ కార్డులో జీవాల సంఖ్య వివరాలు, పశు పోషకుల వివరాలుంటాయి. వ్యాధుల నుంచి టీకాల వరకు సమస్త సమాచారం కార్డులో నిక్షిప్తమై ఉంటుంది. మూగజీవాలకు ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే ఈ కార్డుతో చికిత్స అందించడం సులభమవుతుంది. జిల్లా వ్యాప్తంగా 47,608 పాడి రైతులకు పశువుల ఆరోగ్య సంరక్షణ కార్డులు అందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 29,022 మంది పాడి రైతులకు పశువుల ఆరోగ్య సంరక్షణ కార్డులు అందజేశారు.



పశు ఆరోగ్య సంరక్షణ కార్డు నమూనా

జిల్లాలో పశు సంపద వివరాలు ఇలా..

ఆవులు	75,460
గేదెలు	1,53,542
గొర్రెలు	1,71,263
మేకలు	69,265

జిల్లా వ్యాప్తంగా పశువుల ఆరోగ్య సంరక్షణ కార్డుల పంపిణీ ఇలా..

ఏరియా	పశు వైద్య శాల టార్గెట్	పంపిణీ
రాయవరం	4,550	1,958
ముమ్మిడివరం	4,377	2,155
రామచంద్రపురం	6,500	3,202
ఉప్పలగుప్తం	4,100	2,491
రాజోలు	2,500	2,225
మలికిపురం	4,280	2,720
కొత్తపేట	4,012	2,532
పి.గన్నవరం	3,700	2,475
రావులపాలెం	3,700	2,492
ఆలమూరు	5,042	3,431
అమలాపురం	4,847	3,341

ఆరోగ్య కార్డు గుర్తింపు ఇస్తారిలా..
అన్ని మూగజీవాల వివరాలు ఆన్‌లైన్ చేసి, హోలోగ్రామ్‌తో కూడిన పది అంకెల సంఖ్యలో పొందు పరిచి గుర్తింపును ఇస్తున్నారు. ఈ హోలోగ్రామ్‌ను స్కాన్ చేసినప్పుడు ఆ నంబర్‌తో ఎన్ని జీవాలున్నాయి. రైతు ఎవరు, పశువులకు ఎటువంటి వ్యాధులున్నాయి తదితర వివరాలతో కూడిన సమాచారం తెలుస్తుంది. పశు వైద్య శాఖ ప్రతి పశువుకు కార్డు ఇవ్వకుండా ఆరు పశువులకు (పెద్ద జీవాలకు) ఒక ఆరోగ్య గుర్తింపు కార్డును తయారు చేసి ఇస్తోంది. ఇక మేకలు/గొర్రెలు అయితే 20 జీవాలకు ఒక ఆరోగ్య కార్డును అందిస్తున్నారు. ప్రధానంగా ఇందులో అనేక రకాల సమాచారం పొందుపరుస్తున్నారు.

ఆరోగ్య సంరక్షణ కార్డులు పొందాలి



పాడి రైతులు, గొర్రెల కాపరులు వారి పశువులు, జీవాలకు సంబంధించిన ఆరోగ్య సంరక్షణ కార్డులు పొందాలి. పాడి రైతుల వద్ద ఉంచుకోవాలి. పశువుల ఆరోగ్య సంరక్షణ కార్డుల వివరాలను పశు వైద్య సిబ్బంది రిజిస్టర్ చేస్తారు. పశుగణన, వ్యాధుల నిర్ధారణ, ప్రభుత్వం నుంచి అందించే ఉచిత మందులు, టీకాల వివరాలు, పశు బీమా ఇలా ప్రతీ దానికి పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు ఉపయోగపడతాయి.

– డాక్టర్ కర్నీడి మూర్తి, డిప్యూటీ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, అమలాపురం

క్లుప్తంగా

బైక్ ఢీకొని ఏఎస్సైకు తీవ్ర గాయాలు

రాజమహేంద్రవరం రూరల్: బైక్ ఢీకొని ఆలమూరు ఏఎస్సై కె.వెంకటరమణారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం బొమ్మూరు మురళీకొండ ప్రాంతానికి చెందిన ఏఎస్సై కె.వెంకటరమణారెడ్డి ఆలమూరులో విధులకు వెళ్లేందుకు తన మోటార్‌బైక్‌పై ఆదివారం ఉదయం బయలుదేరారు. హైవేలో బొమ్మూరు సెంటర్‌కు చేరుకునేసరికి, మోరంపూడి నుంచి వేమగిరి వైపు వెళుతున్న మరో మోటార్ బైక్ ఆయనను ఢీకొంది. ఈ ఘటనలో ఏఎస్సైకి తీవ్ర గాయాలు కావడంతో, చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బొమ్మూరు ఎస్సై జెబేర్ మహమ్మద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీరంలో పర్యాటకుల సందడి



సాగర తీరంలో జన కోలాహలం

కొత్తపల్లి: ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో కొత్తపల్లి మండలంలోని గ్రామాలతో పాటు పిఠాపురం, సామర్లకోట, కిర్లంపూడి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. ఉదయం తుని సమీపంలోని తలుపులమ్మతల్లి లోవ దేవస్థానాన్ని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. పర్యాటకులు కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సముద్రపు స్నానాలు చేశారు.

పరీక్షల జ్వరానికి 'చర్చా' మాత్ర!

- 9–12 విద్యార్థులకు 'పరీక్ష పే చర్చ'లో పాల్గొనే చాన్స్
- ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడే అవకాశం
- ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకూ కూడా..
- ఆన్‌లైన్‌లో నమోదుకు జనవరి 12 తుది గడువు



పరీక్షా పే చర్చ బ్రోచర్

రాయవరం: ప్రధానమంత్రితో నేరుగా మాట్లాడాలనుకుంటున్నారా..అయితే ఆ అవకాశం ఇప్పుడు మీ చేతుల్లోనే ఉంది. మీరు చేయాల్సిందల్లా ప్రధానమంత్రి 'పరీక్ష పే చర్చ' యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు కావాల్సి ఉంది. ఏటా పరీక్షల ముందు 'పరీక్ష పే చర్చ' కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 'పరీక్ష పే చర్చ' ఇప్పటికే ఆరవ ఎడిషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకుంది. ఇప్పుడు 7వ ఎడిషన్ నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అందులో భాగంగా దేశవ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేరుగా సంభాషించనున్నారు. పరీక్షలను సమర్థంగా, ఒత్తిడి లేకుండా ఎదుర్కోవడం, చిరునవ్వుతో ప్రశ్నలకు సమాధానాలు రాసేలా ప్రోత్సహిస్తారు. విద్యార్థులకు పరీక్షలపై భయాన్ని తొలగించేందుకు ప్రధానంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదుకు జనవరి 12 తుది గడువు

పరీక్షల సీజన్ త్వరలో ప్రారంభం కానుంది. విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలి.. ఎదుర్కొనే సవాళ్లు ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి? వారి ఆకాంక్షలు ఏమిటి? వాటిని చేరుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలు ఏమిటి? పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఎలా ఉండాలి? ఇలా పలు అంశాలపై «పరీక్షా పే చర్చా» కార్యక్రమం జరుగుతుంది. 'పరీక్ష పే చర్చ' కార్యక్రమంలో పాల్గొనేందుకు 9–12 తరగతులు చదివే విద్యార్థులు అర్హులు. ఈ కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి శక్తివంతమైన యువతతో కనెక్ట్ అవుతారు. యువతతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. యువత ఎదుర్కొనే సవాళ్లను, ఆకాంక్షలను మరింతగా అర్థం చేసుకోవడానికి ఒక అవకాశం కూడా కలుగుతుంది. «పరీక్ష పే చర్చ» మొదటి ఎడిషన్ 2018 ఫిబ్రవరి 16న ఢిల్లీలోని తాల్కటోరా స్టేడియంలో నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రశ్నను ప్రధానమంత్రిని నేరుగా అడగవచ్చు. ప్రశ్న గరిష్ఠంగా 500 అక్షరాల లోపు ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా «పరీక్ష పే చర్చ»లో పాల్గొనవచ్చు. వారి ఎంట్రీలను కూడా ఆన్‌లైన్‌లో పంపే అవకాశం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కల్పించింది.

చర్చించే అంశాలు (విద్యార్థులకు)

- మీ స్వాతంత్య్ర సమరయోధులను తెలుసుకోండి. మన సంస్కృతి మన గర్వం. నా పుస్తకం నా ప్రేరణ. భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడండి. నా జీవితం, నా ఆరోగ్యం. నా స్టార్టప్ కల. ఎస్‌టీఈఎం విద్య/హద్దులు లేని విద్య. పాఠశాలల్లో నేర్చుకోవడానికి బొమ్మలు, ఆటలు

ఉపాధ్యాయుల కోసం

- మన వారసత్వం. అభ్యాస పర్యావరణాన్ని ప్రారంభించడం. నైపుణ్యం కోసం విద్య. తక్కువ కరిక్యులమ్ లోడ్, పరీక్షలకు భయం లేని వాతావరణం. భవిష్యత్తు విద్య సవాళ్లు.

తల్లిదండ్రుల కోసం

- నా బిడ్డ, నా గురువు. వయోజన విద్య–ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులను చేయడం. కలిసి నేర్చుకోవడం, పెరగడం.

లాగిన్ అవ్వాలిలా..

విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లింక్‌ను క్లిక్ చేసి, మొబైల్ నంబరు లేదా జీ మెయిల్ ఖాతాను పూర్తి చేయాలి. ఓటీపీతో లాగిన్ అయి క్లిక్ చేయాలి. ఓటీపీ రాగానే మళ్లీ లాగిన్ చేయాలి. విద్యార్థులు/ఉపాధ్యాయులు/తల్లిదండ్రులు ప్రాథమిక సమాచారం వివరాలను పూర్తి చేయాలి. కార్యాచరణ వివరాలను పూర్తి చేసిన తర్వాత థీమ్‌ను ఎంచుకుని 1,500 అక్షరాల లోపు వివరించాలి. పరీక్ష పే చర్చా కార్యక్రమం నిర్వహణకు జిల్లా స్థాయిలో సైన్స్ అధికారులు జిల్లా కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారు. అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరీక్ష పే చర్చలో పాల్గొనేలా మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరముంది. పరీక్ష పే చర్చలో ఎంపికైన సుమారు 2,050 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా పీపీసీ కిట్‌లను బహుమతిగా అందజేయనున్నారు.

విజేతలుగా నిలిస్తే..

పరీక్షా పే చర్చా కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వారు నేరుగా ప్రధానమంత్రిని కలుసుకునే అవకాశాన్ని పొందుతారు. ప్రతి విజేతకు పరీక్షా పే చర్చా కిట్ అందజేస్తారు. విజేతలకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తారు. విజేతలు ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి ఆటోగ్రాఫ్‌ను, ఫొటోతో కూడిన డిజిటల్ సావనీర్‌ను పొందే అవకాశముంది.

సద్వినియోగం చేసుకోవాలి



'పరీక్ష పే చర్చ' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. 9–12 తరగతులకు చెందిన విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు, జిల్లా సైన్స్ అధికారి కృషి చేయాలి. జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

నరునిగా అవతరించిన నారాయణుడు రాముడు



ప్రవచనం చెబుతున్న సామవేదం షణ్ముఖశర్మ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాముడు మానవుడా, భగవంతుడా అన్న చర్చ తరచు సాగుతుంది. నరుడిగా అవతరించిన నారాయణుడే రాముడు అని సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఆదివారం స్థానిక హిందూ సమాజంలో ఆయన అయిదవ రోజు ప్రవచనం కొనసాగించారు. రావణుడు మానవుని చేతిలో మాత్రమే మరణించ గలడు కనుక దేవతలు నారాయణుని నరునిగా అవతరించ వలసిందిగా ప్రార్థించారు. వాల్మీకి మహర్షి రాముని నారాయణునిగా ధ్వని మాత్రంగా సూచించారు. కావ్యంలో ధ్వని అర్థం చేసుకోగలిగితే నే వాల్మీకి హృదయం అవగతం అవుతుంది. యాగ సంరక్షణ కోసం దశరథుని వద్దకు వచ్చిన విశ్వామిత్రుడు దశరథునితో నీవు మానుష కర్మలు, దైవిక కర్మలు రెంటినీ చేస్తున్నావా అని అడిగాడు. అతిథి అభ్యాగతులను ఆదరించడం మానుష కర్మ అయితే యజ్ఞ యాగాదులు చేయడం దైవీక కర్మలు, రెంటికీ సంబంధం ఉన్నదని అన్నారు. రామాయణంలో ప్రతి ప్రశ్న మనకు ఒక ఉపదేశమే అని అన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ముగిసిన అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య కళాశాలల క్యాంపస్‌లో రెండు రోజుల పాటు జరిగిన 11వ జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2023–24 పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆదిత్య కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించగా కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి, జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జి.శ్యామ్‌కుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేసినట్టు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి, ఎంపీపీ భవాని తదితరులు

రామచంద్రపురం: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో 13 మంది క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆదివారం ఈ మీట్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవాని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, ప్రధాన కార్యదర్శి గన్నమనేని చక్రవర్తి పాల్గొన్నారు. 200 మంది క్రీడాకారులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన 13 మందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చీఫ్ కోచ్ ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి రవితేజ, ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేష్‌కుమార్ వెల్లడించారు. పీడీలు ఎ.శ్రీను, బి.అప్పాజీ, ఎం.సత్యనారాయణ, ఏవీ సత్యనారాయణ, అనురాధ, శ్రీను, ఉమా, పిల్లి అబ్బులు పోటీలను పర్యవేక్షించారు. వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి, కౌన్సిలర్‌లు కేతా సుజాత, డాక్టర్ కె.సతీష్‌కుమార్ డాక్టర్ శివచందు, ఎం.అప్పన్న, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆత్మబంధువు జగన్
- నాలుగున్నరేళ్లలో రూ.2.63 లక్షల కోట్లతో సంక్షేమం
- మంత్రులు కారుమూరి, చెల్లుబోయిన



సమావేశంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు, నాయకులు

దేవరపల్లి/నిడదవోలు రూరల్/ చాగల్లు: సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని బీసీ సంక్షేమ, సమాచార, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణు, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లిలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా యర్నగూడెం ఆర్.కన్వెన్షన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా గుర్తింపు కల్పించిన నేత సీఎం జగన్ అన్నారు. నాలుగున్నరేళ్ల ప్రభుత్వంలో రూ.2.63 లక్షల కోట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు వెచ్చించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని సంక్షేమ పాలన సాగిస్తున్నట్లు చెప్పారు. నాలుగున్నరేళ్ల అభివృద్ధికి 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు గజగజా వణికిపోతున్నారని విమర్శించారు. విద్యార్థులకు ట్యాబ్ అందిస్తుంటే ఈనాడు పత్రిక అభూత కల్పనలతో వార్తలు రాస్తోందని విమర్శించారు. పింఛన్, రేషన్ ఆరోగ్య సురక్ష ద్వారా మందులు ఇంటింటికి అందిస్తున్న సంఘ సంస్కర్త సీఎం జగన్‌కు ప్రజలు సలాం కొడుతున్నారన్నారు. లోకేష్ యాత్ర లావు తగ్గేందుకే, అది క్యాట్ వాక్ అని అభివర్ణించారు. పాదయాత్ర తన నియోజకవర్గంలో వద్దని పార్టీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడే మొత్తుకుంటున్నాడన్నారు. ఎర్రబుక్కు, పచ్చబుక్కుతో లోకేష్ చేసేదేమీలేదన్నారు. 70 శాతం మంత్రి పదవులు, స్థానిక సంస్థల్లో 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. నాడు చంద్రబాబు కౌంటర్ పెట్టి మరీ రాజ్యసభ స్థానాలు అమ్ముకున్నాడన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ బీదా మస్తాన్‌రావు, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మోపీ దేవి వెంకటరమణ, ఆర్.కృష్ణయ్యలను రాజ్యసభకు పంపినట్లు చెప్పారు. నాడు – నేడుతో పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మార్చారని, ఇంగ్లిష్ మీడియం పెట్టి ట్యాబ్‌లు ఇస్తుంటే ఎల్లో మీడియాకు కనిపించడం లేదని విమర్శించారు. టీడీపీ నాయకుల పిల్లలు పబ్‌లలో ఇష్టానుసారంగా తిరుగుతున్నారని, వారు సరిచూసుకోవాలని హితవు పలికారు. గత ప్రభుత్వంలో 12 శాతం ఉన్న పేదరికం , జగన్‌పాలనలో 6 శాతానికి వచ్చిందని, చదువులో 15 శాతంలో ఉంటే 3వ స్థానానికి వచ్చిందన్నారు. పరిశ్రమల పురోగతి 3.5 నుంచి 11.8కి చేరుకుందన్నారు. సమావేశంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' బ్రోచర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావ్, పామాయిల్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ ఎస్.రాజేంద్రబాబు, వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు అనుసూరి పద్మలత, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, సర్పంచ్ బొంత భరత్‌బాబు పాల్గొన్నారు.

షణ్ముఖ నాథ.. అభయప్రద

- నేడు సుబ్రహ్మణ్య షష్ఠి
- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి



బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీప కాంతులు



ఆలయ ముఖ ద్వారం వద్ద పూలసోయగం

బిక్కవోలు: భక్తుల అభయ ప్రదాతగా పేరుగాంచిన బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం రాత్రి 1.20 నిమిషాలకు (తెల్లవారితే సోమవారం) స్వామివారి తీర్థపు బిందె సేవతో షష్ఠి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరానున్న భక్తుల కోసం ఆలయం వద్ద సౌకర్యాలు కల్పించారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బిక్కవోలు, కర్నూల్ జిల్లా కుంకునూరు, విశాఖ జిల్లా నక్కపల్లి, తెలంగాణ రాష్ట్రంలో గద్వాల జిల్లా బలిగేర గ్రామాలకు చెందిన బ్యాండ్ పార్టీలతో మేళాలు ఉంటాయి. అనంతరం 4.00 గంటల వరకు బాణసంచా కాల్పులు ఉంటాయి. 4..30 నుంచి రాత్రి 9 గంటలకు వరకు భక్తి రంజనీ సాంస్కృతిక కార్యక్రమాలు, 9గంటలకు రాత్రి స్వామి వారి గ్రామోత్సవం ఉంటాయి. ఈ సందర్భంగా భారీ బ్యాండ్ మేళాలు, కోయడ్యాన్సులు, గరగ నృత్యాలు ఏర్పాటు చేశారు. రాత్రి 11గంటల నుంచి తెల్లవారే వరకు బాణసంచా కాల్పులు నిర్వహిస్తారు. భక్తుల రద్దీ దృష్ట్యా జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా బయట గ్రామాల నుంచి 50 మంది సిబ్బందిని తీసుకువచ్చినట్టు తెలిపారు. స్నానఘట్టాలలో ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేశారు. ఆలయంలో ప్రవేశించే భక్తులకు అసౌకర్యం కలగకుండా బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు తాగునీరు, పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నాయి. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు వైద్యాధికారి రాజీవ్ తెలిపారు. 300 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. మండలంలోని పందలపాక, కొమరిపాలెం, కొంకుదురు గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

23న పిఠాపురంలో మహాయాగం



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకుడు అల్లంరాజు సత్యనారాయణ శర్మ

పిఠాపురం: పట్టణంలో బాపనాచార్యుల మహాన్నదాన ట్రస్ట్, అంతర్ యోగ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 27 వరకూ సవిత్య కాఠకాగ్ని మహాయాగం నిర్వహిస్తున్నట్లు ఆదివారం నిర్వాహకులు తెలిపారు. పిఠాపురం రాజావారికోట ఆవరణలో కోట సత్తెమ్మతల్లి గుడి ఎదురుగా యాగం నిర్వహిస్తామని నిర్వాహకుడు అల్లంరాజు సత్యనారాయణ శర్మ తెలిపారు. 23న అఖండ సిద్ధ మంగళ స్తోత్రం పారాయణతో యాగం ప్రారంభమవుతుందని, అభిషేకాలు దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా నామ సంకీర్తన పల్లకీ సేవ, నవగ్రహ హోమం, ఆయుష్ హోమం నిర్వహించనున్నట్లు వివరించారు. శ్రీపాదశ్రీవల్లభ స్వామి పిఠాపురంలో జన్మించినందున పరమాత్మ స్వరూపమైన మన బిడ్డలను పూజించుకుందాం అనే నినాదంతో లోక కల్యాణార్థం ఈ యాగం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యాగంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రతిభకు 'వందన'లు



వందనను అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం టౌన్: మలేషియా దేశంలో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తృతీయ స్థానాన్ని సాధించిన పట్టణానికి చెందిన క్రీడాకారిణి పిల్ల వందనకు అమలాపురంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆమెకు స్వాగతం పలికి సత్కరించి అభినందించారు. మలేషియా దేశం నుంచి విజయవాడకు విమానంలో వచ్చిన వందన కారులో అమలాపురం చేరుకుంది. క్రీడాకార సంఘాల ప్రతినిధులే కాకుండా రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులు కూడా స్థానిక గడియారం స్తంభం సెంటరుకు తరలివచ్చి వందనకు స్వాగతం పలికి సత్కరించారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని తృతీయ స్థానంతో సత్తా చాటిన వందన పవర్ లిఫ్టింగ్ విభాగాల్లో ఒక రజత, మూడు కాంస్య పతకాలు సాధించి దేశం గర్వపడేలా నిలిచిందని మంత్రి విశ్వరూప్ అన్నారు. జిల్లా పవర్ లిఫ్టింగ్, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ల అధ్యక్షులు యెనుముల కృష్ణ పద్మరాజు, వంటెద్దు వెంకన్నాయుడు మాట్లాడుతూ తొలిసారి వందన అంతర్జాతీయ క్రీడల్లో రాణించి కోనసీమ జిల్లాకు బాడీ బిల్డింగ్ పరంగా పతాకాలు సాధించుకుని వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. వందనకు శిక్షణ ఇచ్చిన అమలాపురం హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, జిల్లా అసోసియేషన్ కోశాధికారి దొమ్మేటి వెంకటరమణ మాట్లాడుతూ కోనసీమ పవర్ లిఫ్టింగ్ పతాకాన్ని అంతర్జాతీయ వేదికపై ఎగురవేసిన వందన ఇక నుంచి జరిగే అంతర్జాతీయ పోటీల్లో కూడా విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీతోపాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొని వందనకు స్వాగతం పలికి అభినందించారు.

రికార్డు స్థాయి కవితాగానం

30గంటల30 నిమిషాల, 30 సెకన్ల పాటు జరిగిన ఆలపించిన దుర్గారావు



దుర్గారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

అయినవిల్లి: మండలంలోని మాగం గ్రామానికి చెందిన వీధి దుర్గారావు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శనివారం, ఆదివారం 30గంటల 30 నిమిషాల 30సెకన్లపాటు నిరంతరాయంగా కవితా గానం చేసి తన ప్రతిభను చాటారు. శ్రీశ్రీ కళావేదిక ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలలో సత్తా చాటి అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, భారత్ టాలెంట్స్ రికార్డ్, తెలుగు నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరును నమోదు చేయించుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, వేదిక జాతీయ కన్వీనర్ శ్రీమతి కొల్లి రమాదేవి ఆధ్వర్యంలో ఈ కళా ఉత్సవాలు జరిగాయి. దుర్గారావు తప్పిపోతున్న యువత అనే అంశంపై కవితాగానం చేశారు. ఆయన చింతనలంక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గతంలో రాజోలు వద్ద మలికిపురంలో 12గంటల12నిమిషాల12సెకన్లపాటు, తిరుపతి మహతి ఆడిటోరియంలో 48గంటలపాటు జరిగిన కళా ఉత్సవాలలో పలు ప్రపంచ రికార్డులలో తనపేరు నమోదు చేయించుకున్నారు. కథలు, కవితలు పంచపదులు, బాలపంచపదులు రాసి పలు బిరుదులు, పురస్కారాలు సన్మానాలు, సత్కారాలు, పొందారు.